క్లుప్తంగా

డ్రెయిన్ పనులు ప్రారంభం



మచిలీపట్నంటౌన్: నగరంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణ మూర్తి (కిట్టు) అన్నారు. మూడో డివిజన్‌లో గురువారం రూ. 4.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న పక్కా డ్రెయిన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. నగర పాలక సంస్థ సాధారణ నిధులతో పాటు పలు గ్రాంట్ల ద్వారా వచ్చే నిధులతో నగరంలోని అన్ని కాలనీల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ముఖ్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన డివిజన్లలో ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ. 20 లక్షలతో సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నామన్నారు. మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జీ, వార్డు పెద్దలు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన



చిలకలపూడి(మచిలీపట్నం): న్యాయవాదులపై దాడులు చేయడం అమానుషమని మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎస్ ఆర్‌కే ప్రసాద్ అన్నారు. నార్త్ న్యూఢిల్లీలో ప్రముఖ న్యాయవాది వీరేంద్రకుమార్ నార్వాల్‌ను దౌర్జన్యంగా పట్టపగలు హత్య చేయడంపై జిల్లా కోర్టులో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ప్రసాద్ మాట్లాడుతూ వీరేంద్రకుమార్ నార్వాల్‌ను హత్య చేయడం, రాజమండ్రికి చెందిన దుగ్గిరాల సుభాష్‌పై పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించిన ఘటనలు బాధాకరమన్నారు. న్యాయాన్ని కాపాడే న్యాయవాదులపై దౌర్జన్యాలకు పాల్పడటం హేయమైన చర్య అని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చీలి మునలయ్య, న్యాయవాదులు మాదివాడ నరసింహారావు, జవహర్‌లాల్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

నూతన వస్త్రాల పంపిణీ



మచిలీపట్నంటౌన్: నగరంలోని రైలుపేట బేతేలు ప్రార్థనా మందిరంలో గురువారం సంఘస్తులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. మాజీ సైనిక సంక్షేమ సంఘం మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు గాడెల్లి వసంతరావు జన్మదిన వేడుకలను ప్రార్థనా మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ 19వ డివిజన్ ఇన్‌చార్జి బూరగ రామారావు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చలమలశెట్టి గాంధీ ప్రార్థనా మందిరం పాస్టర్ వాల్టర్స్ సంఘస్తులకు నూతన వస్త్రాలను అందజేశారు.

అన్నసమారాధన



మచిలీపట్నంటౌన్: సర్వజన ఆస్పత్రి రోడ్డులోని గంగానమ్మ ఆలయం వద్ద గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధనలో వందలాది మంది భక్తులు అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ భక్తబృందం పర్యవేక్షించింది.

మృతుడి కుటుంబానికి సాయం



కోడూరు: విశ్వనాథపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సభ్యుడు కోట వీరాస్వామి ఇటీవల మృతిచెందాడు. మృతుడి మట్టి ఖర్చుల నిమిత్తం సంఘం ఆధ్వర్యంలో రూ.10వేల నగదును సంఘ చైర్‌పర్సన్ తోట వెంకట నాంచారమ్మ, సీఈఓ చుండూరు రమేష్ మృతుడి కుటుంబ సభ్యులకు గురువారం అందించారు. వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి తోట దామోదరరావు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక పూజలు

గుడివాడ టౌన్: స్థానిక నీలామహల్ రోడ్డులోని 11వ వార్డు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీరామనవమి పందిరిలో గురువారం సరస్వతీదేవికి సామూహిక పూజలను ఘనంగా నిర్వహించారు. పూజల్లో 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఫ్యామిలీ డాక్టర్’ పేదలకు వరం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- వక్కలగడ్డ జగనన్న విలేజ్ క్లినిక్‌లో ఫ్యామిలీ డాక్టర్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

వక్కలగడ్డ (చల్లపల్లి): ఇంటి వద్దే వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటుచేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదలకు వరమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గురువారం వక్కలగడ్డలోని జగనన్న విలేజ్ క్లినిక్‌లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మందులు, పరీక్షలు చేసే విధానాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో వైద్య రంగం పూర్తిగా పడకేసిందని చెప్పారు. తీవ్ర నిర్లక్ష్యానికి గురవడంతో ప్రజలు వైద్యం అందక ఇబ్బందులకు గురయ్యారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీకి జవసత్వాలు కల్పించి, గ్రామ స్థాయిలో జగనన్న విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారని, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్‌లను నియమించి వైద్య పరీక్షలు, మందులు సమకూర్చారని వివరించారు. ఇప్పుడు ప్రతి గ్రామానికి ఎంబీబీఎస్ డాక్టర్ వెళ్లి ఆ గ్రామంలో మంచానికి పరిమితమైన వారికి ఇంటికి వెళ్లి పరీక్షలు చేసి మందులు అందచేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమం పేదలకు మేలు చేస్తోందని వివరించారు.

కార్యక్రమాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రీజనల్ కో–ఆర్డినేటర్ కడవకొల్లు నరసింహారావు, డీఐఓ డాక్టర్ శర్మిష్ట, టీబీ అండ్ లెప్రసీ జిల్లా అధికారి డాక్టర్ అంబటి వెంకట్రావ్, ఆర్‌బీఎస్‌కే కృష్ణా జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ కుంభా రత్నగిరి, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మీ, మండల వైద్యాధికారులు డాక్టర్ కేవీ పద్మావతి, డాక్టర్ కె.విజయరావు, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం బసవయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు తోట సుధాకర్, వేమూరి సుబ్బారావు, ఎంఎల్‌హెచ్‌పీ వసుంధర, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

ఆరోగ్యంపై ప్రతిఒక్కరు శ్రద్ధ వహించాలి

సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య



సర్వజన ఆస్పత్రి వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: ఆరోగ్యంపై ప్రతిఒక్కరు శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం సర్వజన ఆస్పత్రిలో వరల్డ్ హెల్త్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ర్యాలీని రామకృష్ణయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఆస్పత్రి క్యాజువాలిటీ నుంచి ప్రధాన ద్వారం వరకు ర్యాలీ జరిగింది. న్యాయమూర్తి రామకృష్ణయ్య మాట్లాడుతూ ఎన్నో దినోత్సవాలు ఉన్నా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఎంతో విశిష్టమైనదన్నారు. 1950 నుంచి ఏప్రిల్ 7వ తేదీన ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో ఆరోగ్యం ప్రాముఖ్యతను వివరించేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలంతా వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని చెప్పారు. దేశ ప్రగతికి ఆరోగ్యవంతమైన సమాజం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

సర్వజన ఆస్పత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ ఎ. చంద్రశేఖర్, ఆర్ఎంఓ కోలా రామచంద్రరావు, వైద్యుడు టి. శివయ్య, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి. ఆశాలత, చీఫ్ డిఫెన్స్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ప్రతినిధి చీలి మునలయ్య, ఆస్పత్రి, మెడికల్ కళాశాల సిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- యర్రారెడ్డివారిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



బ్రోచర్ అందజేసి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని చేరువ చేయడమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గురువారం కోడూరు–3 సచివాలయం పరిధిలోని యర్రారెడ్డివారిపాలెం, నాయుడుపేట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి రమేష్‌బాబు 350 ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించారు. సంక్షేమ సమాచారానికి సంబంధించిన బ్రోచర్లను అందించి, పథకాలన్నీ సక్రమంగా అందుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు జరుగుతోందని, కులమతాలు, పార్టీలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని తెలిపారు. కోడూరు–అవనిగడ్డ రహదారి నిర్మాణం త్వరలోనే చేపడతామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయడంతో పాటు వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. పలువురు గ్రామస్తులు రహదారులు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టాలని కోరగా..సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవ రెడ్డి వెంకటసత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, సచివాలయాల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి కోట పద్మావతి వరప్రసాద్, ఎంపీటీసీలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే పేర్ని నాని



గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పేర్ని నాని

చిలకలపూడి(మచిలీపట్నం): గ్రామాల్లో ప్రతి రైతు సమస్యను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. మండల పరిధిలోని పెదపట్నం గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. పేర్ని నాని మాట్లాడుతూ మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలోని తీరప్రాంత గ్రామాల్లో అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో వరి, ఆక్వా కల్చర్ సాగు జరుగుతోందన్నారు. ఎటువంటి చట్టబద్ధత కలిగిన పత్రాలు లేకపోవడంతో గత ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాల లబ్ధిదారులు చనిపోయి ఉంటే వారి వారసులకు అసైన్‌మెంట్ పట్టా మంజూరు చేస్తామని చెప్పారు. దీర్ఘకాలంగా ప్రభుత్వ భూమి సాగు చేసుకుని జీవనం సాగిస్తున్న వారికి హెక్టారులోపు భూమి ఉంటే వారికి ప్రభుత్వం పట్టా మంజూరు చేస్తుందని చెప్పారు. గ్రామసభలో 65 మంది గ్రామస్తులు పెట్టుకున్న అర్జీలను గ్రామసభలో చదివి వినిపించారు. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే సచివాలయంలో అర్జీ పెట్టుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఏ ప్రభుత్వం ఇటువంటి ఆలోచన చేయలేదని, ఎన్నో సంవత్సరాల నుంచి ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇప్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ గడిదేశి అనూషరాజ్, ఆర్డీఓ ఐ. కిషోర్, తహసీల్దార్ డి. సునీల్‌బాబు, కేడీసీసీబీ డైరెక్టర్ గడిదేశి బాలజేసు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు శ్రీకాకోళపు నాగేశ్వరరావు (బాబు), ఎంపీడీఓ బాలకృష్ణ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

రెండో రోజు సదస్సులో పాల్గొన్న మేయర్

మచిలీపట్నంటౌన్: ఢిల్లీలోని మారేట్ హోటల్‌లో ఆసియా సిటీ సమిట్ సదస్సు రెండో రోజైన గురువారం జరిగింది. ఈ సదస్సుకు మచిలీపట్నం నగర పాలక సంస్థ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత థామస్ నోబుల్, కమిషనర్ జి. చంద్రయ్య హాజరయ్యారు. 3వ ఉమెన్స్ లీడర్‌షిప్ అంశంపై వర్క్‌షాపు జరిగింది. పలు దేశాలకు చెందిన మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సదస్సులో పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మేయర్ వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ కవిత థామస్ నోబుల్

కొనసాగిన పింఛన్ల పంపిణీ



రామ్మోహనరావుకు మంగళగిరి ఆస్పత్రిలో పింఛను అందజేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ బాబూరావు

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం నగరంలో గురువారం కొనసాగింది. నగరంలో మొత్తం 18,627 పింఛన్లు ఉండగా 18,375 పింఛన్లను పంపిణీ చేసి 98.65 శాతం పూర్తి చేశారు. ఇంకా 252 మంది పింఛనుదారులకు పింఛను మొత్తాలను అందిస్తే నూరు శాతం పంపిణీ పూర్తవుతుంది.

ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: 28వ డివిజన్‌కు చెందిన ఇరువురు వలంటీర్లు గురువారం విజయవాడ, మంగళగిరి ఆస్పత్రులకు వెళ్లి పింఛను మొత్తాలను అందజేశారు.

డివిజన్‌కు చెందిన సబ్బినేని రామ్మోహనరావు మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో కాలుకు ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతున్నాడు. సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ అద్దంకి బాబూరావు మంగళగిరి ఆస్పత్రికి వెళ్లి రామ్మోహనరావుకు పింఛను సొమ్మును అందజేశారు. విజయవాడ క్యాపిటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మొహమ్మద్ ఉస్మాన్‌కు కూడా బాబూరావు ఆస్పత్రికి వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు.

ధాన్యం నిల్వలపై విస్తృత సర్వే

ప్రతి ఆర్‌బీకే పరిధిలో సర్వే చేయాలని ఆదేశాలు



రైతుల నుంచి వివరాలను సేకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య తదితరులు

పెడన: ఖరీఫ్ సీజన్‌లో అధికశాతం రైతులు తమ పంటలను కుప్పలుగా వేసుకుని ఉంచేశారు. ఆరుతడి పంట మినుము పూర్తయిన తరువాత కుప్పలను తీసి నూర్పిళ్లు చేద్దామనే ఆలోచనలతో ఇప్పుడిప్పుడే రైతులు నూర్పిళ్లు ప్రారంభించారు. రైతులు తమ ధాన్యం విక్రయించుకునేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తక్షణం లక్ష్యాలను నిర్దేశించేందుకు ముందస్తుగా సర్వే చేపట్టింది. ఏ రైతు వద్ద ఎంత ధాన్యం ఉందో సర్వే చేస్తోంది. ఒక్కో రైతు రెండు, మూడు ఆర్‌బీకేల పరిధిలో నాలుగైదు ఎకరాలు ఉన్నా ఒకే చోట నమోదు చేయించడంతో సాంకేతిక ఇబ్బందులు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. సాంకేతిక సమస్యలను అధిగమించి రైతులు నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసేలా ముందస్తు ప్రణాళికలకు అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం ప్రతి రైతు భరోసా కేంద్రానికి మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులను నియమించి సర్వే చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో మున్సిపల్ కమిషనర్లను సైతం ఆర్‌బీకేలకు ప్రత్యేక అధికారులుగా నియమించి సర్వే చేపట్టింది. విస్తీర్ణం తక్కువగా ఉండి రైతులు అధికంగా అపరాల సాగుకు ముందే నూర్పిళ్లు పూర్తి చేసుకున్న చోట గురువారం సర్వే పూర్తి చేశారు. వరి కుప్పలు అధికంగా ఉన్న చోట మాత్రం సర్వే చేయడానికి రెండు రోజులు సమయం తీసుకుంటోంది. దీంతో శుక్రవారం కూడా పలువురు అధికారులు సర్వే చేయనున్నారు. అధికారులను ఆర్‌బీకేలలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు రైతుల వద్దకు తీసుకువెళ్లి వారితో మాట్లాడించారు. కుప్ప ఎప్పుడు తీస్తారు..ధాన్యం విక్రయిస్తారా..ఏ రకం విత్తనం సాగుచేశారు తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. పెడన మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్యను పెడన మండలంలోని పెనుమల్లి ఆర్‌బీకేకు ప్రత్యేకాధికారిగా నియమించారు. ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ జయరాంను నడుపూరు, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ ఉరివి, సీఈఓ వై. శ్రీలత చెన్నూరు, డీపీఓ శ్రీనివాసనాయక్ చేవేంద్ర ఇలా పలు ఆర్‌బీకేలకు ప్రత్యేక అధికారులను నియమించి సర్వే చేస్తున్నారు. పూర్తిస్థాయిలో నివేదికలను శుక్రవారం ఉన్నతాధికారులకు ఇస్తామని పెడన వ్యవసాయ శాఖాధికారి జీవీ శ్రీనివాసరావు తెలిపారు.

వెండి శేషవాహనంపై స్వామివారి నగరోత్సవం



మచిలీపట్నంటౌన్: బచ్చుపేటలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారిని వెండి శేష వాహనంపై ఉంచి నగరోత్సవం నిర్వహించారు. ప్రధాన రహదారి మీదుగా సాగిన నగరోత్సవంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఆలయంలో అర్చకుడు ముత్తేవి వెంకటాచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి పూర్వ బలిహరణం, దేవతా ఉద్వాసన మౌన బలిపూర్వక ధ్వజ దేవార్చనం, ధ్వజావరోణం జరిగాయి. రాత్రికి ఆలయ ప్రాంగణంలో శ్రీ రామాంజనేయ యుద్ధం నాటకంలోని ఆంజనేయస్వామి ఏకపాత్రాభినయం ప్రదర్శనను జవ్వాది నాగేశ్వరరావు నిర్వహించగా భక్తులు తిలకించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తల మండలి వంశపారంపర్య చైర్మన్ ముత్తేవి రవికాంత్, కార్యనిర్వహణాధికారి ఎస్ఎస్ చక్రధరరావు పర్యవేక్షించారు.

వైభవంగా సప్తమ వార్షికోత్సవ పూజలు



ప్రత్యేక అలంకరణలో గణనాథుడు

బంటుమిల్లి: అర్తమూరు గ్రామంలోని గణపతి దేవాలయంలో గురువారం సప్తమ వార్షికోత్సవ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చైత్ర పూర్ణిమను పురస్కరించుకుని కమిటీ సభ్యులు లక్ష గరికతో లక్ష నామాలతో పూజ నిర్వహించారు. పండితులు ఐలూరు జైకిషోర్ ఈశానశివాచార్య శిష్య బృందం వేద మంత్రాల మధ్య ఉదయం గణపతిపూజ, ప్రధానమూర్తికి పంచామృతాభిషేకాలు, గణపతి హోమం జరగాయి. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహణకు భక్తులు సమర్పించిన రూ. 5 లక్షల నగదును జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేస్తున్నామని కమిటి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద మొత్తంలో డిపాజిట్ చేసిన భక్తులను వేద మంత్రాల మధ్య పండితులు, కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు



మోపిదేవిలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

మోపిదేవి: మోపిదేవి, పెదకళ్లేపల్లి, గురుకుల పాఠశాలల్లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ డీవైఈఓ సుబ్బారావు బృందం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మోపిదేవి జెడ్పీ పాఠశాలలో 179 మందికిగాను 179 మంది విద్యార్థులు, పెదకళ్లేపల్లి జెడ్పీ పాఠశాలలో 70 మంది విద్యార్థులకు గాను 69 మంది, గురుకుల పాఠశాలలో 93 మందికి గాను 93 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని ఆయా పాఠశాలల చీఫ్ సూపరింటెండెంట్స్ కొడాలి బాల నాగేశ్వరశర్మ, కృష్ణప్రసాద్, ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు.

అభివృద్ధి పనులు అడ్డుకుంటూ కులవివక్ష ఆరోపణలా?

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య

నాగాయలంక(అవనిగడ్డ): పెదపాలెంలో రెండు సీసీ రోడ్లు వేయాలని చూస్తుంటే సర్పంచ్ దున్నా రాజేష్ అడ్డుకోవడమే కాకుండా దానికి కులవివక్షత అని సత్యాగ్రహ దీక్ష చేయడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య అన్నారు. నాగాయలంకలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగాయలంక మండలంలోని పెదపాలెం ఎస్సీ కాలనీల్లో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు రెండు సీసీ రోడ్లు వేయాలనే ఆలోచనతో జిల్లా కలెక్టర్ అనుమతితో పనులు చేస్తుంటే సర్పంచ్ రాజేష్ అడ్డుకోవడం సరికాదన్నారు. మాజీ సర్పంచ్ ఎస్సీ అయినప్పుడు ఇక్కడ కులవివక్షతకు పాల్పడుతున్నారని సర్పంచ్ ఆరోపించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎమ్మెల్యే సింహాద్రి అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేయాలనే సంకల్పంతో పాలన సాగిస్తుండగా టీడీపీ ఆధ్వర్యంలో రాజకీయరంగు పులుముతూ కులవివక్షత ఆరోపణలతో దీక్షలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అన్నివర్గాలు, అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, ఇది చూసి ఓర్వలేక దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని బసవయ్య విమర్శించారు.

సమావేశంలో మండల పార్టీ కన్వీనర్ భోగాది శేషగిరిరావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పెనుమాక జయంతరావు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నాంచారమ్మ అమ్మవారి జాతర



పిట్టల్లంక(కోడూరు): పిట్టల్లంలో నాంచారమ్మ అమ్మవారి జాతర ఉత్సవం కనుల పండువగా జరిగింది. అమ్మవారిని ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పసుపు నీళ్ల వారపోసి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. పిట్టల్లంక, బడేవారిపాలెం, భావిశెట్టివారిపాలెం, నారేపాలెం నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పిట్టల్లంక, బడేవారిపాలెం, సాలెంపాలెంకు చెందిన కళాకారులు నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పెన్షనర్ల వితరణ



మచిలీపట్నంటౌన్: 39వ డివిజన్‌కు చెందిన పింఛనుదారుడు బాలిని ఆంజనేయులు ఇటీవల మృతిచెందాడు. డివిజన్‌లోని తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున వసూలు చేసిన మొత్తం రూ. 50 వేలను మృతుడు ఆంజనేయులు భార్య నాంచారమ్మ కు గురువారం అందజేశారు. కార్పొరేటర్ గోపిశెట్టి సతీష్, వైఎస్సార్ సీపీ డివిజన్ కన్వీనర్లు భోగాదుల సూరిబాబు, పామర్తి నాగబాబు, నాయకులు గోపిశెట్టి రాము పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

పామర్రు: మండలంలో ఉపాధి హామీ పథకం పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ పోలురాజు తెలిపారు. నిమ్మలూరు, కురుమద్దాలి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమ్మలూరు గ్రామంలో చెరువులో పూడికతీత పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ పనులను నాణ్యతా ప్రమాణాలు, కచ్చితమైన కొలతలతో చేయాలని సూచించారు.

కురుమద్దాలి, పామర్రు తదితర గ్రామాల్లో పంటబోదెల్లో పూడికతీత పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఫీల్డు అసిస్టెంట్, మేట్లు పాల్గొన్నారు.

ఐక్య వేదిక బృందం హర్షం

మండవల్లి: ఏప్రిల్ 14వ తేదీ నుంచి జరిగే గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించాలని కోరుతూ ఇటీవల స్పందన కార్యక్రమంలో ఐక్య వేదిక బాధ్యులు అర్జీ అందజేశారు. అర్జీపై ఎండార్స్‌మెంట్ తీసుకోవటానికి ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మల్లీశ్వరి స్వయంగా గురువారం ఇంటికి రావటంతో ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి ఎల్.ఎస్.భాస్కరరావు సంతోషం వ్యక్తంచేశారు.